ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 5 జూలై 2025








## నారసింహుడి సేవలో సుప్రీంకోర్టు జడ్జి సూర్యకాంత్

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం యాదగిరిగుట్టకు వచ్చిన ఆయనకు కొండపైన గెస్ట్ హౌస్ వద్ద జిల్లా కలెక్టర్ హనుమంతరావు మొక్కను బహూకరించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ ఈవో వెంకటరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తర్వాత ఆలయానికి చెందిన బ్యాటరీ వాహనంలో ప్రధానాలయ ప్రాంగణానికి వెళ్ళి తూర్పు రాజగోపురం నుండి త్రితల గోపురం గుండా ప్రధానాలయంలోకి ప్రవేశించారు. ఆలయంలో ఆయనకు ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రధానాలయంలో గర్భాలయానికి అభిముఖంగా ఉన్న స్వర్ణ ధ్వజస్తంభానికి మొక్కి గర్భగుడిలో స్వయంభూ మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఈవో వెంకటరావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి యాదగిరిగుట్ట ప్రధానాలయ సప్తగోపుర సముదాయ ఫొటోను బహూకరించారు. తర్వాత పశ్చిమ రాజగోపురం గుండా ఆలయం వెలుపలకు వస్తూ ఆలయ శిల్పకళా అందాలను పరిశీలించారు. ప్రధానాలయ మాడవీధులు, అష్టభుజి ప్రాకారాల్లో చెక్కబడిన శిల్పాలు, యాలీపిల్లర్లను పరిశీలించారు. అనంతరం ఆలయ చరిత్ర, పునర్నిర్మాణం గురించి జడ్జి సూర్యకాంత్ కు ఆలయ ఈవో వెంకటరావు వివరించారు. అనంతరం బ్యాటరీ వెహికిల్ లో ఆలయ గెస్ట్ హౌస్ కు వెళ్లి లంచ్ చేసి హైదరాబాద్ కు తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ, సూపరింటెండెంట్ రాజన్ బాబు తదితరులు ఉన్నారు.



### జడ్జిని కలిసిన ప్రముఖులు

సుప్రీంకోర్టు జడ్జి సూర్యకాంత్ ను యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుధగానీ శ్రీహరి, మాజీ అధ్యక్షులు గుడ్ల స్వామి, బార్ మెంబర్లు పెంట రమేష్, కృష్ణ డి గణేష్, డి వీరస్వామి, రేణుక, సంతోషా తదితరులు కలిశారు.

## నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**నకిరేకల్ :** నకిరేకల్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్యుడు కీర్తిశేషులు రాచూరి యాదగిరి కుమార్తె సంతోషి రూప అనారోగ్యంతో మృతి చెందింది.. ఆమె జ్ఞాపకార్థంగా సోదరుడు రాచూరి సంతోష్ నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నకిరేకల్ మెయిన్ సెంటర్లో శుక్రవారం సుమారు 300 మందికి అన్నదానం చేశారు. క్లబ్ ప్రెసిడెంట్.. రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని నకిరేకల్ ఎస్సై చారితో కలిసి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద ఎక్కడ ఉంటే లయన్స్ క్లబ్ అక్కడ ఉంటుందని భరోసా ఇచ్చారు తన సోదరి పేరిట సంతోష్ అన్నదానం చేయడం అభినందనీయమని ఆదర్శనీయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్ రావు కార్యదర్శి సూర్య చందర్రావు కోశాధికారి అండెం వెంకటేశం కందాల లక్ష్మీనారాయణ రెడ్డి సా మంతపూరి మురళి శివకోటి ఆంజనేయులు సహాయ కార్యదర్శి దాసా వెంకటేశ్వర్లు మాలే దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు అన్నదాన కార్యక్రమ%శీ% చేసిన రాచూరి సంతోష్ ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.




## సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవు

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రభుత్వ హాస్పిటళ్లలో డాక్టర్లు సహా వైద్య సిబ్బంది సమయ పాలన పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం యాదగిరిగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్సీలో ఉన్న ల్యాబ్, ఫార్మసీ, ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేసి ఎంత మంది సిబ్బంది విధులకు హాజరయ్యారని పరిశీలించారు. డాక్టర్స్, హాస్పిటల్ సిబ్బంది రెగ్యులర్ గా వస్తున్నారా.? లేదా.? అని ఆరా తీశారు. ఓపి రిజిస్టర్ ను చెక్ చేసి ప్రతి రోజూ ఆస్పత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారని ఆరా తీశారు. ఎంత మంది గర్భిణీ స్త్రీలు వస్తున్నారు, ఎంత మంది చెకప్ చేసుకుంటున్నారు, వాళ్ళకి ట్రీట్మెంట్ సరిగా ఇస్తున్నారా.? లేదా.? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ వ్యాధులతో వచ్చే పేషెంట్లకు ప్రభుత్వ ఆస్పత్రుల డాక్టర్లు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటూ.. వైద్యం కోసం వచ్చే వారికి సకాలంలో వైద్యం అందించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటళ్లలో నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలన్నారు. ఫార్మసీలో మందుల కొరత లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని, అవసరమైన మందులు నిల్వ ఉంచాలని సూచించారు.

### ల్యాబ్ టెక్నీషియన్ కు షోకాజ్ నోటీసులు

యాదగిరిగుట్టలోని పీహెచ్సీలో ల్యాబ్ టెక్నీషియన్ గా పని చేస్తున్న సుగుణ రాజుకు కలెక్టర్ హనుమంతరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా విధులకు హాజరుకాని కారణంగా షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. డ్యూటీ పట్ల నిబద్ధతతో ఉండాలని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తామంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయ పాలన పాటించకపోతే ఏస్థాయి ఉద్యోగినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే

### ఆలేరు నియోజకవర్గంలోని పలు సమస్యలపై కలెక్టర్ ను వినతిపత్రం అందజేత



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఆలేరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం.. యాదాద్రి జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ హనుమంతరావును ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో 'యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్' అనే ఎన్జీవో సంస్థ సహకారంతో.. రూ.85 లక్షల వ్యయంతో డంపింగ్ యార్డును 2023లోనే కంప్లీట్ చేశామని, దానిని ప్రజా అవసరాల కోసం వినియోగంలోకి తేవాలన్నారు. అదేవిధంగా ఇదే ఎన్జీవో సహకారంతో మోటకొండూర్ మండల కేంద్రంలోని పీహెచ్సీని 30 పడకల హాస్పిటల్ గా అభివృద్ధి చేసి 24 గంటల వర్కింగ్ హాస్పిటల్ గా మార్చి ప్రభుత్వానికి అప్పగించడమే కాకుండా అప్పటి ప్రభుత్వంతో చర్చించి జీవో కూడా ఇప్పించామని గుర్తుచేశారు. కానీ 30 పడకల హాస్పిటల్ కు సరిపడా వైద్య సిబ్బంది లేరని, వెంటనే అవసరమైన పోస్టులను భర్తీ చేసి మండల ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడానికి సహకరించాలని కోరారు. అలాగే యాదగిరిగుట్టకు మంజూరైన 100 బెడెడ్ ప్రభుత్వ హాస్పిటల్ కు 2023లో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావుతో శంకుస్థాపన చేపించామని, కానీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. వెంటనే హాస్పిటల్ నిర్మాణం షురూ చేసి సాధ్యమైనంత తొందరగా ఫినిష్ చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. అదేవిధంగా యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో 40 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి గ్రామసభ ద్వారా లబ్ధిదారులను సైతం ఎంపిక చేశామని, కానీ ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. గ్రామసభ ద్వారా అధికారుల సమక్షంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను అందజేసి ఇండ్లను అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. బాధ్యత గల మాజీ ఎమ్మెల్యేగా తమ దృష్టికి తీసుకువచ్చిన పై సమస్యలను పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ను కోరామని తెలిపారు.

## భువనగిరి రెవెన్యూ డివిజన్‌లో 11 వేల దరఖాస్తులు

### భువనగిరి రెవెన్యూ డివిజన్ ఆఫీసర్(ఆర్డీవో) కృష్ణారెడ్డి



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి జిల్లాలో ఇటీవల జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో.. భువనగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో భూసమస్యల గురించి ప్రజల నుండి 11,637 దరఖాస్తులు వచ్చాయని భువనగిరి రెవెన్యూ డివిజన్ ఆఫీసర్(ఆర్డీవో) కృష్ణారెడ్డి వెల్లడించారు. వీటిలో పాస్ బుక్ డేటా కరెక్షన్(పీడీసీ) కోసం వచ్చిన దరఖాస్తులు అత్యధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. శుక్రవారం యాదగిరిగుట్టలో తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎన్ని పరిష్కారం అయ్యాయో అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుండి దరఖాస్తుల రూపంలో వచ్చిన సమస్యలను ఆగస్ట్ 15లోపు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించించిన నేపథ్యంలో.. దరఖాస్తులను ఆన్ లైన్ చేసే ప్రక్రియను స్పీడప్ చేసి పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ధరణి చట్టంలో సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి అవకాశం లేదని, ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తెచ్చిన భూభారతి చట్టంలో అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. చట్టం ప్రకారం 2014 కు ముందు ఉన్న సాదాబైనామాలకు సంబంధించి 2020 అక్టోబర్ 12 నుండి 2020 నవంబర్ 10 మధ్యలో చేసుకున్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని విచారణకు సిద్ధంగా పెట్టుకుంటామని, ప్రభుత్వం ఎప్పుడు డైరెక్షన్స్ ఇస్తే అప్పుడు ఎంక్వైరీ జరిపి రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఇక రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని, ఈ నెల 14న సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అధిక రేట్లు కాకుండా పాత పద్దతుల్లో రేట్లు తీసుకోవాలని తాపీ మేస్త్రీలతో మీటింగ్ అరేంజ్ చేసి చెప్పగా.. అందుకు వారు సానుకూలంగా అంగీకారం తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

## జనగామ వద్ద లోయలో పడ్డ కారు

### నలుగురు యువకులకు తీవ్ర గాయాలు..

జనగామ, జూలై 4: (రోమింగ్ న్యూస్) : జనగామ జిల్లా కేంద్రం సమీపంలో వడ్లకొండ క్రాస్ రోడ్ గానుగుపహాడ్ వాగు బ్రిడ్జి దగ్గర లోయలో జరిగిన ఘోర ప్రమాదంలో లోయలో కారు పడిపోయినది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో లోయలో పడిపోయిన కారు లో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురి అయిన వారిని మహారాష్ట్ర వాసులుగా పోలీసులు గుర్తించారు. కారు లో మొ-ంత్తం 5గురు యువకులు ఉండగా అందులో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఒకరు మాత్రం చిన్న గాయాలతో ప్రమాదం





నుంచి బయటపడ్డారు. గాయపడ్డ వారిని వెంటనే అక్కడికి చేరుకున్న అంబులెన్స్ ద్వారా జనగామ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది . ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారి ప్రాణాలు ఆ భగవంతుడే కాపాడాలంటూ జరిగిన ప్రమాదాన్ని కం కనపడ్డ కారు దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన అక్కడి ప్రజలు అంటున్నారు. అయితే ఇంకా ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జనగామ పోలీసులు కేసు దర్యాప్తు చూస్తున్నారు

